క్లుప్తంగా

గ్రామంలో రోడ్డు ఆక్రమణపై ఫిర్యాదు



అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్ శైలకుమారి

దొరవారిసత్రం: మండలంలోని మానేరి గ్రామంలో ప్రభుత్వం వేసిన రోడ్డును స్థానికులు కొందరు ఆక్రమించుకుంటూ వస్తున్నారని సోమవారం తహసీల్దార్ శైలకుమారికి పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి ప్రభుత్వ రోడ్డును కాపాడాలని కోరారు. పలు రెవెన్యూ పరమైన సమస్యలపై అధికారులకు అర్జీలు అందాయి. ఎంపీడీఓ గోవర్ధన, వివిధ శాఖల అధికారులు హరికృష్ణ, జ్యోతిర్మయి, ఉమామహేశ్వరి, మోహన్‌రావు, మునిరాజ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్‌ను అందిస్తున్న డీఎంహెచ్‌వో నాయకులు

దొరవారిసత్రం: మండల కేంద్రానికి చెందిన అనురాధ వాకాడు మండలం నిడిగుర్తి ప్రాంతంలోని పీహెచ్‌సీలో ఫార్మసిస్ట్‌గా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఫార్మసిస్ట్ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ తరఫున బాధిత కుటుంబానికి అండగా నిలిచి మృతురాలి భర్త జయరాజుకు డీఎంహెచ్ఓ సుజాత చేతుల మీదుగా సోమవారం నెల్లూరులో రూ.1,29,800 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్‌జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రత్నాకర్‌బాబు, నాయకులు సూర్యప్రగతి, సురేష్, ప్రదీప్, శ్రీలత, వనమ్మ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నేతలు

చిల్లకూరు: విద్యుత్ స్మార్ట్ మీటర్లను గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సమయంలో తీవ్రంగా వ్యతిరేకించిన టీడీపీ నాయకులు, నేడు అదే పని చేయడంపై సీపీఎం నాయకులు తీవ్రంగా విమర్శించారు. గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డులో విద్యుత్ స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే అనర్థాలను ప్రతి వినియోగదారునికి వివరిస్తూ సీపీఎం నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జోగి శివకుమార్, పుట్టా శంకరయ్య, అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య, బీవీ రమణయ్య, రామిరెడ్డి, రమేష్, మధు, బూతాటి చంద్రయ్య పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక ఆధార్ సేవలు



ఆధార్ సేవలను అందిస్తున్న అధికారులు

కలువాయి(సైదాపురం) : మండలంలోని కలువాయి సచివాలయం–2 వద్ద ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక ఆధార్ కేంద్రం సోమవారం నిర్వహించారు. సచివాలయం అడ్మిన్ సుధాకర్ మాట్లాడుతూ ఎటువంటి ఐడీ ప్రూఫ్ లేకుండా ఉన్న ఎస్సీ, ఎస్టీలకు ఆధార్ కేంద్రాల్లో నమోదు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఆధార్ సవరణలు సరిచేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారుల డుమ్మా

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా విజ్ఞప్తుల దినానికి అధికారులు డుమ్మా కొట్టడంపై వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అధికారులపై ఆగ్రహించారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆ సమయంలో ఎంపీపీ, ఎంపీడీఓతో పాటు పలు శాఖల అధికారులు కార్యాలయానికి హాజరు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలోని సీహెచ్‌సీ వైద్యశాల, మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను తనిఖీ చేసి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

చికెన్ ధరలు		05.8.2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	107
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	200
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	222
లేయర్ చికెన్	:	190

అమ్మపాలు బిడ్డకు అమృతం

- 7 వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాల పై అవగాహన కల్పిస్తున్న వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్ బేగం

దక్కిలి: వ్యాధులకు కారణం పోతపాలు.. బిడ్డ సరైన ఎదుగుదలకు కావాలి తల్లిపాలు అంటూ ప్రపంచ తల్లిపాల విశిష్టతపై అన్ని మండలాల్లో గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్నారు. వారోత్సవాలు ఈ నెల 1వ తేదీ శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం (ఐసీడీఎస్) పర్యవేక్షణలో వెంకటగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని దక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి రూరల్, వెంకటగిరి పట్టణంలో 261 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 7వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, యువతులకు క్విజ్ పోటీలు, బొమ్మలు, పోస్టర్లు, బ్యానర్లతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. పుట్టిన గంటలోపే ముర్రిపాలు పట్టించడంపై నెలకొన్న తల్లుల అపోహలను తొలగించే దిశగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు.

తల్లి పాలకు ప్రాధాన్యత ఇవ్వండి

ఈ ఏడాది ప్రపంచ వ్యాప్తంగా తల్లిపాలకు ప్రాధాన్యత నివ్వండి – స్థిరమైన మద్దతు వ్యవస్థలను సృష్టించండి అనే నినాదంతో తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. వెంకటగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఏడాది లోపు పిల్లలు 1007 మంది, ఏడాది నుంచి మూడేళ్ల వరకు 5,779 మంది, మూడేళ్ల నుంచి ఐదేళ్లలోపు పిల్లలు 3,962మంది ఉన్నారు. గర్భవతులు 869మంది, బాలింతలు 817 మంది ఉన్నారు.

తల్లిపాలే బిడ్డకు మొదటి టీకా

బిడ్డకు ముర్రిపాలు రోగ నిరోధక శక్తిని పెంపొందిచడానికి మొదటి టీకాగా ఉపయోగపడుతుందని తహసీల్దార్ ఎం శ్రీనివాసులు అన్నారు. మండలంలోని మోపూరురోడ్డు, లింగసముద్రం ఎస్సీ కాలనీ, కందలవారిపల్లి గిరిజన కాలనీ, మాధవయ్యపాళెం అంగనవాడీ కేంద్రాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి బిందు ప్రియాంక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వినిషా, హెల్త్ సూపర్‌వైజర్ ఆదిలక్ష్మీ, సీహెచ్ఓ సలోమి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

చిల్లకూరు: బిడ్డలకు తల్లి పాలు అమృతంతో సమానం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సూచించారు. మండలంలోని చింతవరం, తిక్కవరం సెక్టార్లలోని తిక్కవరం ఎస్టీ కాలనీ, చింతవరం సెక్టార్ పరిధిలోని ఈదులవారిపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. సూపర్‌వైజర్లు నాగిశెట్టి రేణుక, పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు వై రమణమ్మ, తిప్పమ్మ, చంద్ర, రోజా, హైమావతి, ముత్యాలమ్మ, చంద్ర కళ, సుశీల, నాగభూషణమ్మ, ఆశా వర్కర్లు రాజమణి, సునీత, విజయలక్ష్మి పాల్గొన్నారు.



చిల్లకూరు: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్



దక్కిలి: మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలో మంగళవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జి ఏఈ జయకుమార్ తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని 33 కేవీ లైన్‌కు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నట్లు చెప్పారు. ఈ కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలియజేశారు.

ఆరుతడి పంటలపై రైతులు మొగ్గు చూపాలి

చిట్టమూరు: ప్రకృతి వ్యవసాయంలో రైతులు మెట్ట ప్రాంతాల్లో ఆరుతడి పంటలు పండించేందుకు మొగ్గు చూపాలని డీపీఎం షణ్ముగం పేర్కొన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంలో రైతులకు ఆరుతడి పంటల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ పద్ధతిలో ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల శ్రమ, శక్తి, ఖర్చులు తగ్గుతాయన్నారు. అలాగే 30 శాతం సాగు నీరు ఆదా చేసుకోవచ్చని పేర్కొన్నారు. పంటల దిగుబడి కూడా పెరిగి రైతులకు ఆదాయం వస్తుందని తెలిపారు. పురుగు మందులు, రసాయనాలు లేని వ్యవసాయం ద్వారా వచ్చే ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నిరంజన్, ఎన్ఎఫ్ఏ నీలమ్మ, మండల యూనిట్ ఇన్‌చార్జి ధనమ్మ, ట్రయినర్స్ బాబా సాహెబ్, ధనుంజయ, రాజేశ్వరి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

గూడూరురూరల్ : ఖాయిలా పరిశ్రమల యజమానుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను పేదలకు పంపిణీ చేయాలని, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాను కలసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ చిల్లకూరు మండలంలో వేలాది ఎకరాల్లో ఏర్పాటు చేసిన ఎస్.బీ.క్యూ స్టీల్ పరిశ్రమ, చింతవరం సమీపంలో ఏర్పాటు చేసిన మాస్ అప్పెరల్ ఫ్యాబ్రిక్ పరిశ్రమలు బ్యాంకుల నుంచి కోట్లాది రూపాయలు, ప్రభుత్వం నుంచి వేలాది ఎకరాలు పొందినప్పటికీ, నేడు శిథిలావస్థలో ఉన్నా యన్నారు. పరిశ్రమల కోసం తీసుకున్న భూముల్లో సిలికా వ్యాపారం చేయాలని ప్రభుత్వ అనుమతుల కోసం ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళన



ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆ సంఘం నేతలు

సూళ్లూరుపేట రూరల్ : కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ సోమవారం స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు సీడీపీఓ కార్యాలయం వద్ద ఆందోళనలు చేపట్టారు. సూళ్లూరుపేట ప్రాజెక్టు నాయకురాలు హైమావతి సారథ్యంలో మూడు మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు సీడీపీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలపై పనిభారం పెంచుతూ ఒత్తిడి చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వ అందించిన సెల్ ఫోన్‌లను ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల సంఘం నాయకురాలు జీ బేబిరాణి, కే సుబ్బరామమ్మ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్లు సరెండర్ చేసిన అంగన్‌వాడీలు



సెల్‌ఫోన్లను అప్పగిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కోట: అంగన్‌వాడీలపై ప్రభుత్వం పనిభారం మోపడాన్ని వ్యతిరేకిస్తూ కోట ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్లు సోమవారం ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లను సీడీపీఓకు సరెండర్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్‌వాడీ సిబ్బంది కోట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సీడీపీఓ మునికుమారికి సెల్‌ఫోన్లను అప్పగించారు. యూనియన్ అధ్యక్షురాలు పద్మలీల మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బందిపై పని ఒత్తిడి ఎక్కువైందన్నారు. సెల్‌ఫోన్లను ఉపయోగించి యాప్‌ల ద్వారానే ప్రతి పని చేయాల్సి వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు విజయలక్ష్మి, కోటేశ్వరి, సుజాత పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన

ఓజిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై మండల ఇన్‌చార్జి జైతున్ బీ సోమవారం అవగాహన కల్పించారు. గ్రామాల్లో రసాయనిక ఎరువులు వినియోగించకుండా పండించిన కూరగాయలు, ఆకు కూరలు, పండ్లను విక్రయించారు. రసాయనిక ఎరువులు వినియోగించిన పదార్థాలను ఆహారంగా తీసుకోవడంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ప్రజలు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కోరారు.

నూతన వధూవరులకు కిలివేటి ఆశీస్సులు



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేటటౌన్: వైఎస్సార్‌సీపీ నాయకులకు బంధువైన తంబిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి కుమారుడు తంబిరెడ్డి చరణ్ రెడ్డి, గడదాసు వెంకటేశ్వర్లు కుమార్తె భవ్య లేఖ వివాహ రిసెప్షన్ వేడుకల్లో సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. నాయుడుపేటలోని కేఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం రాత్రి జరిగిన వేడుకల్లో నూతన వధూవరులకు ఆశీసులు అందించారు. అనంతరం పట్టణంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయం సమీపంలో ఉన్న నూతన వెంచర్ వద్ద వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఒట్టూరు కిషోర్ యాదవ్, రాధ దంపతులు నూతన గృహ ప్రవేశం చేశారు. ఇక్కడ నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రత పూజల్లో కిలివేటి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరిహారం చెల్లించాలి

సైదాపురం: స్థానిక పంచాయతీ కమ్మవారిపల్లిలో నిమ్మ చెట్లను తొలగించినందున బాధిత రైతులకు ఎకరాకు రూ.5లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని నెల్లూరు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య పేర్కొన్నారు. బాధిత కుటుంబాలను వారు సోమవారం పరామర్శించారు. అనంతరం నరికివేసిన నిమ్మ చెట్లు ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానిక తహసీల్దార్ సుభద్రతో చర్చించారు. ఆయన వెంట కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాల్, వడ్డెర కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకులు అల్లాడి గోపాల్, పంచేటి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

పెళ్లకూరు: మండలంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న భూ సమస్యలపై వెంటనే స్పందించి పూర్తి స్థాయిలో పరిష్కరించాలని తహసీల్దార్ హరికృష్ణ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా శిరసనంబేడు, పునబాక, నందిమాల, అర్ధమాల, తాళ్వాయిపాడు గ్రామాల్లో భూసమస్యలపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నందున ఆయా గ్రామాల వీఆర్వోలు పూర్తి స్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలారాణి, ఎంఈవో వెంకటేశ్వర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం



ఆరోగ్య కేంద్రం ముందు చేరిన వర్షపు నీరు



తహసీల్దార్ కార్యాలయం ముందు వరదనీరు

సైదాపురం: ఉక్కపోతతో అల్లాడిపోతున్న జనానికి సోమవారం కురిసిన భారీ వర్షంతో ఉపశమనం లభించింది. సుమారు 2గంటల పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ప్రజలతో పాటు నిమ్మ రైతులు ఆనందపడ్డారు. సోమవారం మధ్యాహ్నం 3 నుంచి 5గంటల వరకు కుండపోతగా వర్షం కురవడంతో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు కూడా వరదనీరు చేరడంతో అధికారులతో పాటు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రం సమీపంలో కైవల్యనది ఉధృతంగా ప్రవహిస్తోంది.

వెంకటగిరిలో ఓ మోస్తరు వర్షం

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని సోమవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు ఈ వర్షంతో కాస్త ఉపశమనం కలిగింది

వార్డులో సమస్యలను పరిష్కరించాలి

వెంకటగిరి రూరల్: తమ వార్డులలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరిశంకరయ్య పేర్కొన్నారు. పట్టణంలోని సుదర్శన్ నగర్‌లోని సచివాలయంలో సోమవారం ప్రజలు వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు.

దారి కావాలంటూ వినతి

సైదాపురం: ప్రభుత్వ భూమి ఆక్రమించుకోవడంతో ఎస్సీ కాలనీలో ఉన్న శ్మశానానికి వెళ్లేందుకు దారిలేక ఇబ్బందులు పడుతున్నట్లు లింగసముద్రం గ్రామ సర్పంచ్ వరప్రసాద్‌రాజుతో పాటు ఎస్సీ కాలనీ ప్రజలు సోమవారం తహసీల్దార్ సుభద్ర విన్నవించుకున్నారు. మొలకలపూండ్ల, చీకవోలు తదితర గ్రామాల నుంచి భూ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ బహూకరణ



ల్యాప్‌టాప్ అందజేస్తున్న నిర్వాహకులు

గూడూరురూరల్ : యోగాలో గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన ద్వారకేష్ అనే విద్యార్థికి సోమవారం గూడూరులోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలు ఆడిటోరియంలో రోటరీక్లబ్ గూడూరు వెస్ట్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ పీఎంరావు చేతుల మీదుగా రూ.50వేల విలువైన ల్యాప్‌టాప్‌ను అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు విజయ భాస్కర్‌రెడ్డి, సెక్రటరీ రాఘవరెడ్డి, వాసుగౌడ్, తాళ్లూరు శ్రీనివాసులు, సనత్‌రెడ్డి, ధనంజయరెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, గిరిబాబు, సుబ్రమణ్యం, రామ్మోహన్, హరినాథ్‌రెడ్డి, కోదండరామయ్య, కృష్ణ, శ్రీనివాసరావు, కట్టా మురళీకృష్ణ, రాజా పాల్గొన్నారు.

వినతులు సత్వరమే పరిష్కరించాలి

ఓజిలి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందించే వినతులను సత్వరమే పరిష్కరించాలని తహసీల్దార్ పద్మావతి తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయంలో అర్జీదారుల నుంచి సోమవారం వినతులు స్వీకరించారు.

చిట్టమూరు: స్థానిక గ్రామ సచివాలయంలో సోమవారం ఎంపీడీఓ మనోహర్ గౌడ్ ప్రత్యేక విజ్ఞప్తుల దినం నిర్వహించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పంచాయతీ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

విద్యుత్ స్తంభం ఏర్పాటు

పెళ్లకూరు: మండలంలోని తాళ్వాయిపాడు గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కన నెలకొన్న విద్యుత్ స్తంభం సమస్యను సోమవారం రెవెన్యూ, పోలీస్ అధికారులు పరిష్కరించారు. జాతీయ రహదారి పక్కన విద్యుత్ స్తంభం ఏర్పాటు విషయమై ఆ శాఖ అధికారులతో స్థానికులు కొందరు వాగ్వాదానికి దిగారు. దాంతో పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు.

పేకాట స్థావరాలపై దాడులు

చిల్లకూరు: మండలంలోని కమ్మవారిపాళెం–కోట మండలం కొండుగుంట గ్రామాల మధ్య పేకాడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు మూడు బృందాలుగా పలు చోట్ల సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. అయితే అక్కడ పేకాటతోపాటు వ్యభిచారం కూడా సాగుతున్నట్లు తెలిసింది. పేకాడుతున్న కడప, రాజంపేట, నెల్లూరు ప్రాంతాలకు చెందిన ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి భారీ స్థాయిలో నగదును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వారికి చెందిన రెండు కార్లు, రెండు బైక్‌లు స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. అయితే ఈ దాడుల సమాచారాన్ని పోలీసులు గోప్యంగా ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రోడ్డు గుంతలమయం.. అవస్థల ప్రయాణం



కోటపోలూరు పాఠశాల వద్ద రాళ్లు లేచిన రోడ్డు



గుంతల మయంగా ఉన్న రోడ్డు

సూళ్లూరుపేట రూరల్ : మండలంలోని కోటపోలూరు నుంచి కోట–వాకాడు వెళ్లే రోడ్డు అధ్వాన్నంగా మారింది. సుమారు 55 కి.మీ.ల వరకు ఉన్న తారు రోడ్డు గుంతలతో నిండిపోయింది. ఫలితంగా సూళ్లూరుపేట, దొరవారిసత్రం, చిట్టమూరు మండలాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డు సింగిల్ రోడ్డు కావడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సూళ్లూరుపేట, తడ సమీపంలోని శ్రీసిటీ, మాంబట్టు సెజ్‌ల్లో ఈ మూడు మండలాల ప్రజలు అక్కడ పనులు చేస్తుంటారు. వీరి రాకపోకలతో రోడ్డు నిత్యం రద్దీగా ఉంటోంది. అయితే ఆ రోడ్డు మార్గం గుంతలమయంగా ఉడడంతో వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం సాగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, సీఎం జగన్‌మోహన్ రెడ్డితో సంప్రదింపుల జరిపి ఈ రోడ్డు మార్గానికి సుమారు వరకు డబుల్ రోడ్డు వేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే ఎన్నికలు రావడంతో ఆగిపోయింది.

గ్రామీణులకు నరకయాతన

కోటపోలూరు నుంచి కోట–వాకాడు రోడ్డుపై ప్రయాణించాలంటే వాహనదారులకు నరకయాతనగా మారింది. కోటపోలూరు, ఆబాక, సాబంతమల్లాం, దొరవారిసత్రం మండలంలోని శ్రీధనమల్లి, కల్లూరు, పులతోట, చిట్టమూరు మండలంలోని కలుగుర్తిపాడు, మల్లాం, నాటు ఓచూరు, రాగోలపాలెం, ఆరూరు, కొత్త గుంట తదితర 20 గ్రామాలకు సుమారు 30 కి.మీ.ల వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డును కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం గమనార్హం.